
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 జనగామ
శుక్రవారం 28 నవంబరు 2025





గెలుపు గుర్రాలు ఎవరు?

- అభ్యర్థుల వేటలో రాజకీయ పార్టీలు
- గ్రామాల్లో విస్తృతంగా పార్టీల సమావేశాలు
- విధేయత, పనితీరుపై దృష్టి..
- ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఎంపికలు..
- పోటీ ఉన్న చోట బుజ్జగింపుల పర్వం
- జిల్లాలో పంచాయతీ ఎన్నికల హడావుడి

జనగామ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఎన్నికల్లో పోటీ చేయించేందుకు రాజకీయ పార్టీలు అభ్యర్థుల వేటలో పడ్డాయి. జిల్లాలో మొదటి విడత నామినేషన్ల పర్వం గురువారం నుంచి ప్రారంభమైంది. దీంతో వివిధ పార్టీలు తమ పార్టీ తరపున బలమైన అభ్యర్థి నిలిపేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎవరిని నిలబెడితే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే కోణంలో ఆయా పార్టీల నేతలు విస్తృతంగా ఆలోచనలు చేస్తున్నారు. పార్టీ తరపున నిలబెట్టిన అభ్యర్థి గెలుపు పైనే పార్టీలకు ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుంది. దీంతో ఆయా పార్టీలు గట్టి అభ్యర్థిని నిలబెట్టాలని ఆలోచిస్తున్నాయి.

బుజ్జగింపుల పర్వం

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో ఆయా పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నాయి. అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీలు పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలవడం ద్వారా తమ సత్తా చాటాలని బీఆర్ఎస్ భావిస్తుండగా.. గ్రామాల్లోనూ తమ పాలనే ఉండాలని కాంగ్రెస్ అనుకుంటోంది. వీటితో పాటు తమ సత్తా ఏంటో కూడా చూపించేందుకు బీజేపీ, సీపీఎం, సీపీఐ పార్టీలు భావిస్తున్నారు. కాగా.. అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ గ్రామాల్లో విస్తృతంగా సమావేశాలు నిర్వహించుకుంటున్నాయి. ఆయా గ్రామాల్లో కార్యకర్తలు మీటింగులు ఏర్పాటు చేసుకొని అభ్యర్థులు ఎవరన్న దానిపై ఏకాభిప్రాయానికి వస్తున్నారు. ఏకాభిప్రాయం కుదరని చోట మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి నేతలు రంగంలోకి దిగి బుజ్జగింపులు చేస్తున్నారు. భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామంటూ హామీలు ఇస్తున్నారు.

పనితీరే కాదు పైసలుంటేనే బెటర్..

అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీలు ఆచితూచి ఎంపిక చేస్తున్నాయి. పోటీ చేయబోయే అభ్యర్థికి వ్యక్తిగత ఫాలోయింగ్‌తోపాటు పార్టీకి, నియోజకవర్గాల ముఖ్య నేతలకు విధేయుడిగా ఉండేలా చూసుకుంటున్నారు. దీనితో పాటు పార్టీకి చేసిన, పనితీరును ఎంపికకు ప్రామాణికంగా భావిస్తున్నారు. వీటితో పాటు ప్రధానంగా ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటున్నారు. పార్టీకి, ముఖ్య నేతలకు విధేయుడిగా ఉండి, పార్టీలో పనితీరు బాగున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే కూడా అభ్యర్థిగా ప్రకటించేందుకు ఆయా రాజకీయ పార్టీలు ఆలోచిస్తున్నారు. టికెట్ ఇచ్చినా తమపై ఆధారపడకుండా సొంతంగా ఎన్నికల ఖర్చు పెట్టుకునే స్తోమత ఉందా లేదా అని చూస్తున్నారు. దీని వల్ల ఆయా పార్టీల్లో ఏళ్లుగా కష్టపడుతున్న పేద కార్యకర్తలు, నాయకులకు చుక్కెదురు అవుతోంది.



ఎవరి ఎజెండా వారిదే..

- ఆసక్తికరంగా మారుతున్న పంచాయతీ పోరు
- సర్పంచ్ స్థానాల్లో పాగాకు పార్టీల తహతహ
- తమ మద్దతుదారులను గెలుపించుకునేందుకు వ్యూహాలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పంచాయతీ ఎన్నికల్లో గెలుపు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారింది. పార్టీలకతీతంగా జరిగే పల్లె పోరులో పార్టీ జెండా ఎగురవేయాలని తహతహలాడుతున్నాయి. తమ పార్టీ మద్దతుదారులను బరిలో దించేందుకు గ్రామాల్లో నేతలు మంతనాలు జరుపుతున్నారు. ప్రజల్లో పలుకుడి, ఆర్థిక స్తోమత ఉన్న అభ్యర్థుల కోసం వెతుకుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి నినాదంగా పల్లె ల్లో పాగా వేసేందుకు అధికార కాంగ్రెస్ పావు లు కదుపుతుండగా, బీసీ జెండానే ఎజెండాగా ప్రతిపక్షాలు పల్లె పోరులో కాంగ్రెస్‌ను ఢీకొనేందుకు సిద్ధమవుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, పార్టీ పునాదులను పటిష్ఠం చేసుకునే దిశగా అన్ని పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నాయి.

పార్టీల ఫోకస్...

పంచాయతీ ఎన్నికలు పార్టీలకు అతీతం గా నిర్వహిస్తున్నారు. పార్టీ గుర్తులు, రాజకీ య హామీలు లేకుండా.. సర్పంచ్, వార్డు స్థా నాలకు అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. అయితే పల్లెపోరులో పైచేయి సాధించేందుకు ఆయా పార్టీల నేతలు తమ మద్దతుదారులను బరిలో దించుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,708గ్రామ పంచాయతీలు, 15,006 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలను అప్పటి అధికార పార్టీ బీ ఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఏ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా గెలిచిన సర్పంచ్‌లు కూడా అభివృద్ధి కోసం గులాబీ కారెక్కారు. ప్రస్తుతం జనగామ మినహా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యూహాలను అమలు చేస్తుంది. ఇప్పటికే పోటీ లేని చోట నామినేషన్లు వేసుకునేందుకు అభ్యర్థులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు తమ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నారు. పోటీ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో పోటీదారుల మధ్య రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. తప్పుకుంటే ఎంపీటీసీకి అవకాశం ఇస్తామని హామీలు ఇస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థులకు దీటుగా బరిలో దించేందుకు బీఆర్ఎస్ కూడా ఆర్థికంగా బలమైన నేతలను, గుర్తించి టికెట్లు కేటాయిస్తున్నారు. పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నర్సంపేట పెద్ది సుదర్శన్‌రెడ్డి, భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి, పరకాలలో చల్లా ధర్మారెడ్డి ఇప్పటికే మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో ఉన్నారు. అయితే బీజేపీ స్థానిక ఎన్నికల్లో పోటీకి సి ద్ధంగా ఉన్నప్పటికీ నేతల మధ్య సమన్వయం లేదనే టాక్ వినిపిస్తుంది. పోటీ చేసే అభ్యర్థుల ఎంపికతో పాటు (మిగతా 7లో..)

నామినేషన్లు షురూ!

- ఐదు మండలాల్లోని 30 క్లస్టర్లలో స్వీకరణ
- మొదటి రోజు సర్పంచులకు 108, వార్డు స్థానాలకు 44 నామినేషన్లు

జనగామ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన కీలక ఘట్టం జిల్లాలో ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల్లో ప్రధానమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ఆరంభమైంది. జిల్లాలో మొదటి విడత ఐదు మండలాల్లోని 108 గ్రామ పంచాయతీలు, 1,024వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఈ ఐదు మండలాల్లో నామినేషన్ల స్వీకరణకు 30 క్లస్టర్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ క్లస్టర్లలో నామినేషన్లను గురువారం స్వీకరించారు. నామి నేషన్ల స్వీకరణ గురువారంతో ప్రారంభమై శనివా రంతో ముగుస్తుంది. ఆ తర్వాత 30న నామినేషన్ల పరిశీలన, 31న చెల్లుబాటు అయిన నామినేషన్ల జాబితా ప్రదర్శన ఉంటుంది. డిసెంబరు 1 వరకు అప్పీళ్లకు అవకాశం ఇస్తారు. 2వ తేదీ వరకు వచ్చిన అప్పీళ్లను పరిష్కరిస్తారు. అభ్యర్థులు తమ నామినే షన్లను ఉపసంహరించుకునేందుకు డిసెంబరు 3 వరకు గడువు ఉంటుంది. అదే రోజు బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

తొలి రోజు అంతంత మాత్రంగానే..

జిల్లాలో తొలి రోజు (మిగతా 8వ పేజీలో)



జఫర్‌గడ్ సర్పంచ్‌కి బీఆర్ఎస్ తరపున నామినేషన్ వేస్తున్న నంచర్ల యాదగిరి

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — మొదటి రోజు 27-11-25

మండలం పేరు	మొత్తం సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	మొత్తం వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
లింగాలఘనపురం	21	15	196	11
జఫర్‌ఘడ్	21	24	194	08
చిల్పూర్	17	17	168	10
స్టేషన్‌ఘన్‌పూర్	15	17	146	07
రఘునాథపల్లి	36	35	320	08
మొత్తం	110	108	1024	44

నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా సరిచూడాలి



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ నిఖిల, కలెక్టర్

లింగాలఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్, వార్డుమెంబర్ అభ్యర్థులు నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా సరిచూడాలని రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు నిఖిల సూచించారు. గురువారం లింగాలఘణపురం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి పరిశీలించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను అడిగితెలుకున్నారు. నామినేషన్ పత్రాలతో పాటుగా జతపర్చాల్సిన ధ్రువపత్రాలను అభ్యర్థులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, శ్వేత పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి..

- ఏకగ్రీవాలకు గ్రామస్థులు మొగ్గు చూపొద్దు: కలెక్టర్
- చిన్నపెండ్యాలలో నామినేషన్ కేంద్రం పరిశీలన

చిలుపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక నిర్వహించేందుకే సిద్ధం కావాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ ప్రజలకు సూచించారు. గురువారం చిన్నపెండ్యాలలో నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను సిబ్బందికి వివరించారు. నామినేషన్ పత్రాలతో పాటు, నిబంధనలతో కూడిన బుక్‌లెట్లను అభ్యర్థులకు జారీ చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతీఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, పంచాయతీ సెక్రటరీ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘బ్రాండ్’ మారింది గురూ..!



- చిన్నబోతున్న చీప్ లిక్కర్
- ఎన్నికల వేళ ఖరీదైన మద్యం వైపే గ్రామస్థుల మొగ్గు..
- వెలుగులోకి ఎన్నికల చిత్రం

7

జనరల్ స్థానంలో ఓసీలు జీరో

- సాల్వాపూర్‌లో ఒకేఒక్క గుర్తు తెలియని మహిళ..
- ఆమెది ఈ ఊరు కాదంటున్న స్థానికులు

8



కాసుల వర్షం..!

- వసూలవుతున్న మొండి బకాయిలు
- ఎన్నికల వేళ నిండుతున్న గ్రామ పంచాయతీల ఖజానా

8



అహంకారం, బలుపుతో మాట్లాడితే
పెద్ద నాయకుడు కాలేడు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

- అయ్య పేరు, కుటుంబం పేరు చెప్పుకొని రాజకీయాలు చేయడం లేదు
- కేసీఆర్ లేని రోజు బీఆర్ఎస్ ముక్కలు, చెక్కలు అవుతుంది..
- చెల్లె కవితకు సమాధానం చెప్పలేని దద్దమ్మ కేటీఆర్
- కేసీఆర్ ఉన్నాడు కాబట్టే బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఆగుతున్నాడు..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజం

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అహంకారం, బలుపుతో మాట్లాడితే కేటీఆర్ పెద్ద నాయకుడు అవుతాడని అనుకోవడం అవివేకమని, అయ్య పేరు, కుటుంబం పేరు చెప్పుకొని తాను రాజకీయాలు చేయడం లేదని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వరంగల్ పర్యటనకు వచ్చిన కేటీఆర్ చాలా మాటాలు మాట్లాడారని, కడియంకు దమ్ముంటే రాజీనామా చేయాలని కడియంకు నీతి, విలువలు ఉంటే ప్రజా క్షేత్రంలోకి రావాలని మాట్లాడారని గుర్తుచేశారు. కడియం దమ్మున్న నాయకుడని, అయ్య అండా చూసుకొని, అయ్య పేరు చెప్పుకొని రాజయాల్లోకి రాలేదన్నారు. స్వతహాగా ఎదిగివచ్చిన నాయకుడిని నేను అని తెలిపారు. కేసీఆర్ లేకుంటే కేటీఆర్ అడ్రస్ ఎక్కడా, అసలు నీ గుర్తింపు ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్లలో (మిగతా 8వ పేజీలో)

మాన్‌సింగ్‌తండా ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు 8లో

పట్టాల పంపిణీకి వేళాయె..

- నేడు వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- ఓవరాల్ టాపర్‌గా సీఎస్ఈ విద్యార్థి శ్రీసత్య నవీన్
- 1,913 మందికి పట్టాలు, 14 మందికి బంగారు పతకాలు
- ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా ఎం.డి. ఆనంద రామమూర్తి

7లో

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయే..



ఎగ్జిబిట్లతో వస్తున్న ప్రయివేట్ స్కూల్ విద్యార్థులు

- నేటి నుంచి జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన
- 522 ఎగ్జిబిట్లు.. రెండు రోజుల నిర్వహణ
- సాన్‌మారియా స్కూల్‌లో సందడి

జనగామ కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన-25 (సైన్స్ ఫెయిర్) నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జనగామలోని సాన్‌మారియా ఉన్నత పాఠశాలలో నేడు, రేపు ప్రదర్శన నిర్వహిస్తారు. డీఈవో, జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆదేశాలతో గత సైన్స్ ఎగ్జిబిషన్ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం మరింత ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

522 ఎగ్జిబిట్ల ప్రదర్శన..

జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 522 ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. సైన్స్ ఫెయిర్‌లో 350 మంది ఎగ్జిబిట్లను ప్రదర్శించనుండగా, ఇన్‌స్పైర్ కార్యక్రమానికి 77మందితో మొత్తం 522 ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. మరో 100 మంది విద్యార్థులు సెమినార్‌లో పాల్గొంటారు. ఉపాధ్యాయులు ఏడు ఎగ్జిబిట్లను, ట్రైనీ ఉపాధ్యాయులు 10 ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తారు. అలాగే, విద్యార్థులకు ప్లాస్టిక్ కాలుష్యంపై క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సీహెచ్.ఉపేందర్ తెలిపారు. సాన్ మారియా హైస్కూల్‌లో ప్రదర్శన నిమిత్తం 22 గదుల్లో ప్రదర్శన వస్తువులు ఏర్పాటు చేశారు. ఇన్‌స్పైర్-మనక్ కొరకు ప్రత్యేకంగా 10 గదుల్లో 77 ప్రయోగాల ప్రదర్శనకు (మిగతా 8వ పేజీలో)



కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

ఎమ్మెల్యే కడియంను కలిసిన ధన్వంతి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన లకావత్ ధన్వంతి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కడియం, ధన్వంతిని శాలువాతో సత్కరించి స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కడియం మాట్లాడుతూ జిల్లాలో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, అన్ని వర్గాల నాయకులను కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. జిల్లాలో పార్టీ పటిష్టానికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కడియం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, మంచాల ఎల్లయ్య, గుడి వంశీధర్ రెడ్డి, కొలిపాక సతీష్, తెల్లాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరశురామ్‌కు అంబేద్కర్, పూలే జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న పరశురామ్

జనగామ కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ అంబేద్కర్, పూలే జాతీయ అవార్డు అందుకున్నారు. పూలే, అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని అంబేద్కర్ ఆడిటోరియంలో గురువారం 72వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థి, యువజన, వికలాంగుల, దళిత సంఘాలలో ఎన్నో పదవులు పొంది, వారి హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి, 2016లో కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి సంఘాన్ని స్థాపించి అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని పల్లె నుంచి ఢిల్లీ వరకు ఎన్నో యాత్రలు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేశాడు.

ఆయన చేసిన సామాజిక కార్యక్రమాలను గుర్తించి పరశురామ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కాగా బీహార్ మాజీ ముఖ్యమంత్రి జీతిన్‌రాం, ఫౌండేషన్ చైర్మన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు పి.వి.రత్నం, మారప్ప, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఐఏఎస్ అధికారి పరశురామ్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చెన్నూరు క్రీడాకారులు



సందీప్



కుమార్

పాలకుర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీలకు జనగామ జిల్లా మండలం చెన్నూరుకు చెందిన క్రీడాకారులు బాలబోయిన సందీప్, రావుల కుమార్‌లు ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ బాధ్యుడు ఎన్.భగత్ తెలిపారు. జనగామలో ఈనెల 2న ప్రిస్టన్ ఇన్‌స్టిట్యూట్ మైదానంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించగా వారు ఎంపికైనట్లు తెలిపారు. 28, 28, 29 తేదీల్లో ఆదిలాబాద్ ఇల్లా ఇచ్చోడలో జరిగే 12వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

జిల్లా విద్యార్థులకు వైజ్ఞానిక విద్య

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించడంతోపాటు నాణ్యమైన వైజ్ఞానిక విద్యను అందించేందుకు ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టెమ్ ఎడ్యుకేషన్ ఫర్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో తన చాంబర్‌లో ప్రథమ్ ఫౌండేషన్ బృందంతో కలిసి జిల్లాలోని పాఠశాలల్లో సైన్స్ బలోపేతానికి చేపట్టనున్న కార్యక్రమాలపై సమగ్రంగా కలెక్టర్ గురువారం చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ అంశాలపై అవగాహన పెంచేలా ఆన్‌లైన్ వీడియోలు, టీచర్లకు ప్రత్యేక గైడెన్స్, స్టెమ్ ఆధారిత బోధన విధానాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రథమ్ ఫౌండేషన్ ద్వారా అందించే స్టెమ్ ప్రోగామ్‌ను జిల్లాలోని ప్రతి పాఠశాలలో సమర్థంగా అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే ఫౌండేషన్ అందించే బోధన సామగ్రి పాఠశాలలకు చేరే విధంగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, ఏఎంవో విజయపాల్‌రెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ రాజగోపాల్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్స్, ప్రథమ్ ఫౌండేషన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులు, ప్రథమ్ ఫౌండేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రం

వెంకటాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (టీఎస్ ఎస్టీయూ) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి మంచర్ల వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంకటాపురం మండల కేంద్రంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు పూనెం రమణయ్య, ప్రధాన కార్యదర్శి పాండా రామారావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష అనేది తీవ్ర మానసిక సంకటంగా మారిందని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సమర్థులని, వారు ఎన్ని పరీక్షలైనా ఎదుర్కొని నిలుస్తారని అన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష క్వాలిఫై కావాలనే తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయులను ఇలా ఒత్తిడికి గురిచేయడం వల్ల తరగతి గదిలో బోధన నాణ్యత దెబ్బతింటుందన్నారు. ఇది బోధన, అభ్యసన ప్రక్రియకు తీవ్ర ఆటంకంగా మారిందని అన్నారు. సమర్థులైన ఉపాధ్యాయులకు మళ్లీమళ్లీ పరీక్షలు ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలన్నారు. లేనట్లయితే సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు అడప రాజేందర్, వాంకుడోత్ రాంబాబు, ఎస్కే.నాయుడు, పోతు రాజశేఖర్, రెడ్డి రాంబాబు, శిరీష, ఉషారాణి, సమ్మక్క, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సక్రమంగా అందించాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

భూపాలపల్లిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవలు ప్రజలకు సక్రమంగా అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. తన చాంబర్‌లో విద్య, వైద్య, సంక్షేమ, తపాలా, ఈడీఎం తదితర శాఖల అధికారులతో ఆయన గురువారం జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్లు గడువులోపు పూర్తిచేయాలన్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించడంతో పాటు అప్‌డేట్ కూడా చేయించాలని తెలిపారు. ఐదేళ్లు, 15ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బయోమెట్రిక్ చేయించుకోవాలన్నారు.

ఇంకా ఆధార్ నమోదు చేపించుకోనివారు జిల్లాలో ఎవరైనా ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 5,64,369 మందికి ఆధార్ కార్డులున్నాయని తెలిపారు. వీరే కాకుండా మిగిలిన వారు ఎవరైనా ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి జిల్లాలో అందరికీ ఆధార్ కార్డు ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో రాజేందర్, డీఎంహెచ్‌వో మధుసూదన్, సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశ్వరి, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న అశోక్ కుమార్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రుద్రయ్య (ఫైల్)

జఫర్‌గఢ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలలో మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామారావు కథనం ప్రకారం.

గ్రామానికి చెందిన చాగంటి రుద్రయ్య(57)కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇదీ విషయమై రుద్రయ్యను భార్య కోమల బుధవారం రాత్రి మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవజరగడంతో మనస్తాపం చెందిన రుద్రయ్య అదే రోజు రాత్రి పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు సాంబరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ

- ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు



తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయురాలు బాలసంధ్య

వాజేడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు గాయాలైన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఉపాధ్యాయులు నిరంజన్, బాలసంధ్య ఉదయం విధులకు వెళ్తున్న క్రమంలో ధర్మవరం-చెరుకూరు మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఇసుక లారీ ఢీకొట్టింది.

ఈ ఘటనలో నిరంజన్‌కు స్వల్ప గాయాలు కాగా బాలసంధ్య తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు వారిని వైద్యం కోసం ఏటూరునాగారం తరలించారు. ఈ రహదారిలో ఇసుక లారీలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పేరూరు పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఆంగ్లంలో నైపుణ్యం సాధించేలా..

● ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్ ● విల్ 2 కాన్ సంస్థ సహకారంతో తరగతులు ● 17 నుంచి కొనసాగుతున్న క్లాస్‌లు

జనగామ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఇంగ్లి‌ష్‌పై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులకు అధికారులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'దిక్సూచి' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు అన్ని పాఠశాలల్లో 30నిమిషాలు ప్రత్యేక పీరియడ్ నిర్వహించి నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన పరుస్తున్నారు. కాగా, తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులతో ఇంగ్లి‌ష్‌లో భావ వ్యక్తీకరణ చేసినప్పుడు మాత్రమే వారు భవిష్యత్తులో వారి వారి వృత్తుల్లో రాణించగలుగుతారు. కొంత మంది ఉపాధ్యాయుల్లో ఇంగ్లిషు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు తక్కువగా ఉన్నాయని గమనించిన కలెక్టర్ హైదరాబాద్‌కు చెందిన విల్ 2కాన్ అనే సంస్థ సౌజన్యంతో ఆ సంస్థ డైరెక్టర్ రామేశ్వరం గౌడ్ సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ ప్రతి రోజు సాయంత్రం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు ఆన్‌లైన్‌లో స్పోకెన్ ఇంగ్లిషు, ఇంగ్లిషు డ్రాఫ్టింగ్ నైపుణ్యాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమం ఈ నెల 17న ప్రారంభమైంది. 30రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో ఉపాధ్యాయులు తరగతి గదిలో ఉపయోగించాల్సిన ఇంగ్లిషు భాష నైపుణ్యాలు, తమ సబ్జెక్టు అంశాలు నేర్పడానికి అవసర మైన ఇంగ్లిషు భావ వ్యక్తీకరణ పద్ధతులను, ఇంగ్లి షులో రాత నైపుణ్యాలను అవగాహనచేసుకుంటారు.

స్పోకెన్ ఇంగ్లిషు తరగతులపై కలెక్టర్ పర్యవేక్షణ ..

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్వయంగా హాజరై తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా తరగతులకు హాజరైన సుమారు 1500 మంది ఉపాధ్యాయులతో కలెక్టర్ వర్చువల్‌గా మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయులందరూ ఇంగ్లిషు భాష నైపుణ్యాలను పెంపొందించుకొని విద్యార్థులను ఇంగ్లిషులో ప్రావీణ్యులను చేయాలని సూచించారు. ప్రతీ సబ్జెక్టులో ప్రధానమైన కాన్సెప్టులపై విద్యార్థులకు ఇంగ్లిషులో ఉపాధ్యాయులు అవగాహన కల్పించేలా ప్రయత్నిస్తున్నారు.

మూల్యాంకనం కూడా ...

ఆన్‌లైన్‌లో నిర్వహించే స్పోకెన్ ఇంగ్లిషు 30రోజుల కార్యక్రమం ముగిసిన తర్వాత ఉపాధ్యాయులకు ఒక మూల్యాంకనం నిర్వహిస్తారు. అనంతరం వారికి సర్టిఫికేట్స్ కూడా అందించనున్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు ఎంత బిజీగా ఉన్నా గైర్హాజరు కావద్దని, ప్రతి రోజు గంట సమయం కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలతో కలిపి 650 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2119 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలి



ప్రతి రోజు ఆన్‌లైన్‌లో నిర్వహించే స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాఫ్టింగ్ తరగతులకు అందరు ఉపాధ్యాయులు హాజరై రామేశ్వరం గౌడ్ చెప్పే ఇంగ్లిషులో మెలకువలు నేర్చుకోవాలి. ఉపాధ్యాయులు ఇంగ్లిషులో రాత నైపుణ్యాలను కూడా పెంపొందించుకొని విద్యార్థులకు అందించడానికి కృషి చేయాలన్నారు. విధిగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్ తరగతులకు హాజరు కావాలి.

– బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏఎంవో, జనగామ



ఆన్‌లైన్ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ప్రైవేట్ కళాశాల వద్ద ఆందోళన

కరీమాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కాజీపేట మండలం 44వ డివిజన్ భట్టుపల్లి ప్రధాన రోడ్డుపై ఉన్న సిగ్మా జూనియర్ కళాశాల గురుకులంలో విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యం విద్యార్థి కుటుంబ సభ్యులకు తెలుపగా వారు, విద్యార్థి సంఘాలు కళాశాలకు చేరుకొని ఆందోళన చేపట్టారు. గూడెప్పాడ్‌కు చెందిన విద్యార్థి శివరాంరెడ్డి సిగ్మా కళాశాలలో సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి గురువారం ఉదయం 5 గంటల నుం చి కళాశాలలో కనిపించకుండా వెళ్లాడు. తమ కుమారుడి ఆచూకీ తెలపాలని విద్యార్థి కుటుంబ సభ్యులు యాజమాన్యాన్ని నిలదీశారు. కళాశాల ఫర్నిచర్, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. దీంతో కళాశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న మడికొండ పోలీసులు కళాశాల వద్దకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. శివరాం కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ సీఐ పుల్యాల కిషన్ తెలిపారు.

చిట్‌ఫండ్స్ నిర్వాహకులపై కేసు నమోదు

కాటారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని భవితశ్రీ చిట్ ఫండ్స్ బ్రాంచి నిర్వాహకులపై కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్ గురువారం వెల్లడించారు. 2022లో రూ.5లక్షల చిట్టీ వేసిన తాము డబ్బులు కట్టినప్పటికీ ఎత్తిన డబ్బులు నిర్వాహకులు చెల్లించలేదని, పైగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని దామెరకుంటకు చెందిన రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాటారంలో ఉన్న భవితశ్రీ చిట్‌ఫండ్స్ బ్రాంచ్‌ను ఎత్తేయగా హనుమకొండలోని మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లగా డబ్బులు ఇస్తామని చెప్పి సంవత్సరాలు తిప్పించుకున్నారని బాధితులు పేర్కొన్నారని తెలిపారు. చివరకు ఇటీవల డబ్బులు ఇచ్చేది లేదని బెదిరించారని ఫిర్యాదు చేయడంతో చిట్‌ఫండ్స్ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎండీ శ్రీనివాస్, ఈడీ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యార్థిని ఆకస్మిక మృతి

స్కూల్‌కు నడుచుకుంటూ వస్తూనే అనంత లోకాలకు

కన్నీటి పర్యంతమైన విద్యార్థులు, కుటుంబ సభ్యులు



మృతి చెందిన విద్యార్థిని దివిజశ్రీ

హనుమకొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని దివిజశ్రీ(14) ఆకస్మికంగా మృతి చెందింది. గురువారం సుబేదారి సీఐ మేకల రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. నాయుడు పెంట్రోల్ బంక్ వినాయకనగర్ కాలనీకి చెందిన సూరారపు క్రాంతికుమార్ - కల్యాణి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. క్రాంతికుమార్ మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పెద్ద కూతురు దివిజశ్రీ హనుమకొండలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఉదయం స్కూల్ వ్యాన్‌లో స్కూల్‌కు వచ్చింది.

స్కూల్ లోనికి నడుచుకుంటూ వెళ్తూ కిందపడి పోయినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి దివిజశ్రీని తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో తోటి విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అప్పటి దాక నడుచుకుంటూ అందరితో మాట్లాడిన దివిజశ్రీ ఆకస్మిక మృతి చెందడంతో పాఠశాలలో విషాదం నెలకొంది. కాగా, దివిజశ్రీ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ మేకల రంజిత్‌కుమార్, ఎస్సైలు మహేందర్‌రెడ్డి, ఫణిలు తెలిపారు. కాగా, విద్యార్థిని దివిజశ్రీ మృతికి గుండెపోటు కారణమని వైద్యులు చెబుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6980	6300
మక్కలు	1855	1521
కందులు	----	----
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	7610	3500
పల్లికాయ (పచ్చిది)	6000	3890
పసుపు (కాడి)	12222	12222
పసుపు (గోల)	11709	11709
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	14700	14700
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	18500	12000
యూఎస్341ఏసీ	17500	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

– వరంగల్ వ్యవసాయం

పట్టాల పంపిణీకి వేళాయె..

- నేడు వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- ఓవరాల్ టాపర్‌గా సీఎస్ఈ విద్యార్థి శ్రీసత్య నవీన్
- 1913 మందికి పట్టాలు, 14 మందికి బంగారు పతకాలు
- ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా ఎం.డి. ఆనంద రామమూర్తి
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన క్యాంపస్



స్నాతకోత్సవంలో పట్టాలు అందుకునేందుకు వచ్చిన విద్యార్థులతో నిట్‌లో నెలకొన్న సందడి

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం శుక్రవారం జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యాంపస్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ (ఏఎల్‌సీ)లో జరిగే వేడుకకు ఈ సారి ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా, మైక్రాన్ టెక్నాలజీ ఆపరేషన్ ఇండియా ఎల్‌ఎల్‌పీ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద రామమూర్తి హాజరవుతున్నారు. గౌరవ అతిథులుగా సియాంట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్, మాజీ మేనేజింగ్ డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ బోర్డ్ ఆఫ్ గవర్నర్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి, డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (డీఆర్‌డీ) సెక్రెటరీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) చైర్మన్ కూడా అయిన డాక్టర్ వి.సమీర్ కామత్ హాజరవుతున్నారు.

1913 మందికి పట్టాలు

నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గురువారం బోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సారి మొత్తం 1913 మంది విద్యార్థులకు పట్టాలను అందజేయనున్నట్టు తెలిపారు. వీరిలో 953 మంది బీటెక్, 556 మంది ఎంటెక్, 149 మంది ఎంఎస్‌సీ, 38 మంది ఎంబీఏ, 56 మంది ఎంసీఏ విద్యార్థులు, 142 మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 19 మంది బీఎస్ సీ, బీఎస్‌సీ (హానర్స్), ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

ఉత్తమ బీటెక్ ప్రాజెక్టు అవార్డు విజేత
మీర్ రహమాన్ (ఎంటెక్, సస్టేనబుల్ ఎనర్జీ జనరేషన్ అండ్ స్టోరేజీ టెక్నాలజీస్)

బెస్ట్ ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు విజేత
ఆయేషా డాంగే (ఎంటెక్, సస్టేనబుల్ ఎనర్జీ జనరేషన్ అండ్ స్టోరేజ్ టెక్నాలజీస్)

ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్ అవార్డు విజేత
డాక్టర్ నిఖిల్ భరత్ (మెకానికల్ ఇంజనీరింగ్)

14 మందికి బంగారు పతకాలు

ప్రతీ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో బీటెక్‌లో టాపర్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈసారి ముగ్గురు విద్యార్థులు డైరెక్టర్ గోల్డ్ మెడల్స్ అందుకోబోతున్నట్టు తెలిపారు. వీరిలో ఓవర్ ఆల్ టాపర్‌గా పాలచర్ల శ్రీ సత్య నవీన్ నిలిచారు. ఆయన అన్ని బీటెక్ ప్రోగ్రాముల్లో అత్యున్నతంగా నిలిచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఇన్‌స్టిట్యూషనల్ గోల్డ్ మెడల్ (డైరెక్టర్స్ గోల్డ్ మెడల్) అందుకోబోతున్నారన్నారు. దీంతో పాటు ఆయన రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్‌ను కూడా స్వీకరించబోతున్నారు. అలాగే అన్ని ఎంటెక్ ప్రోగ్రాములలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా కొండ సౌమ్య కూడా డైరెక్టర్ గోల్డ్ మెడల్ స్వీకరించనున్నట్టు చెప్పారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్‌సీ కోర్సుల్లో కూడా అందరికన్నా టాపర్‌గా నిలిచిన రోహన్ గుప్తాకు కూడా డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. బీటెక్ ప్రాజెక్టు అవార్డును మీర్ రహమాన్, ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు ఆయేషా దాంగే, పీహెచ్‌డీ థీసిస్ అవార్డు డాక్టర్ నిఖిల్ భరత్ అందుకోబోతున్నట్టు వెల్లడించారు.

మా అమ్మ ప్రోత్సాహం మరువలేను



వరంగల్ నిట్‌లో బిటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)లో ఓవరాల్ టాపర్‌గా డైరెక్టర్ గోల్డ్ మెడల్ (ఇన్‌స్టిట్యూషన్)తో పాటు అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నందుకు రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ లభించినందుకు ఆనందంగా ఉంది.ఈ విజయంలో మా అమ్మ సునీత దేవి ప్రోత్సాహం ఎంతో ఉంది. మాది తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం అచ్యుతాపురం గ్రామం. రైతు కుటుంబం.
- పాలచెర్ల శ్రీ సత్య నవీన్, రెండు బంగారు పతకాల విజేత



గోల్డ్‌మెడలిస్టులతో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

ఇద్దరికి అత్యున్నత పురస్కారాలు

వరంగల్ నిట్ చరిత్రలో మొదటి సారిగా ఇద్దరికి అత్యున్నత పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు డైరెక్టర్ తెలిపారు. సాయుధ దళాల కోసం దేశావాళీ రక్షణ వ్యవస్థలను, అధునాతన సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేసినందుకు గుర్తింపుగా డీఆర్‌డీవో చైర్మన్ వి సమీర్ కామత్‌కు గౌరవ డాక్టరేట్‌ను, అలాగే దేశానికి భద్రత, సస్టేనబుల్ ఎనర్జీ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో కీలక భూమిక పోషించినందుకుగాను గుర్తింపుగా ఎన్. వేణుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (హానరీస్ కాసా) ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు.

డైరెక్టర్ గోల్డ్ మెడల్ విజేతలు :

- పాలచర్ల శ్రీ సత్య నవీన్, బీటెక్ (కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)
- కొండా సౌమ్య, ఎంటెక్ (పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్)
- రోహన్ గుప్తా ఎంఎస్‌సీ (ఆర్గానిక్ కెమిస్ట్రి)

రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేతలు:

- పెరవాలి సుధీర్ కుమార్ (సివిల్ ఇంజనీరింగ్)
- ఉకాలే అశుతోష్ అనిల్ కుమార్ (ఎలక్ట్రికల్ అండ్ ఎకానమిక్స్ ఇంజనీరింగ్)
- దేశ్‌పాండే శ్రేయాస్ (మెకానికల్ ఇంజనీరింగ్)
- మండపాక వెంకట శివ శ్రీమంత్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్)
- కరుపర్తి నాగసాయి కార్తీక్ (మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్)
- పాడి తేజేశ్వర్ రావు (కెమికల్ ఇంజనీరింగ్)
- పాలచర్ల శ్రీ సత్య నవీన్ (కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)
- శానిక నిఖిల్ కన్‌హేర్ (బయోటెక్నాలజీ).



దేవస్థానంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్



కూల్చివేస్తున్న దేవస్థానం పరిసరాల్లోని షాపింగ్‌కాంప్లెక్స్

జాతర సమీపిస్తున్నా అదే తీరు

- మేడారంలో మెరుగుపడని సౌకర్యాలు
- ముందస్తు మొక్కులకు వస్తున్న భక్తులకు ఇబ్బందులు

తాడ్వాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి తరలివస్తున్న భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మహాజాతర సమీపిస్తున్నా ఇంకా సౌకర్యాలు మెరుగుపడలేదు. దీంతో ముందస్తుగా వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న వారు సమస్యలతో సతమతం కావాల్సి వస్తోంది. ముఖ్యంగా ఇక్కడ తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఓ భక్తుడు ఇటీవల బహూకరించిన ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. ఈ ప్లాంట్ కోసం దేవాదాయ శాఖ అధికారులు రూ.3లక్షలు ఖర్చు చేసి బోరు బావి, షెడ్ నిర్మించారు. ఈ ప్లాంట్ కొన్ని రోజులు ఉపయోగంలోనే ఉంది. సంవత్సర కాలంగా అధికారులు, సిబ్బంది పటించుకోకపోవడంతో రిపేర్‌కువచ్చింది. 2026 మహా జాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో ముందస్తుగావస్తున్న భక్తులకు నీటిసౌకర్యం కరువైంది.తల్లుల దర్శనం అయ్యేంత వరకు చుక్క నీరు కూడా తాగకుండా ఉండాల్సి వస్తోంది.

షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత

మేడారం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దేవస్థానం పరిసరాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చి వేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 2018లో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ. 4కోట్లతో 27 షాప్‌లను నిర్మించారు. మేడారం దేవస్థానం వందల సంవత్సరాలు శాశ్వతంగా నిలిచేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా రూపొందించిన మాస్టర్ ప్లాన్ నిర్మాణాలకు అడ్డుగా ఉందని దీన్ని తొలగించారు. దీంతో తాము జీవనోపాధిని కోల్పోయామని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యామ్నాయంగా శాశ్వతంగా అధిక సంఖ్యలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి తరలివస్తున్న భక్తులు అక్కడి అటవీ ప్రాంతంలో విడిది చేస్తుంటారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఆ ప్రదేశమంతా వ్యర్థాలతో నిండిపోయాయి. భక్తులు చెట్ల కింద శుభ్రం చేసుకొని సేద తీరాల్సి వస్తోంది. మేడారం నుంచి తాడ్వాయి వెళ్లే రహదారిలో సుమారు ఐదు కిలో మీటర్ల మేర చెత్త, వ్యర్థాలు పేరుకు పోయాయని, అయినా అధికారులు పారిశుధ్య పనులు చేపట్టడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యర్థాలను పాడి పశువులు, దుక్కిటెద్దులు, పందులు, మేకలు, గొర్రెలతోపాటు వణ్యప్రాణులు తింటూ మృత్యువాత పడుతున్నాయని అంటున్నారు. వెంటనే మేడారం పరిసరాలోని అటవీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనులు ప్రారంభం

మహాజాతర నేపథ్యంలో భక్తకోటికి సౌకర్యాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పలు పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాల కోసం టెండర్లను ఆహ్వానించగా ఆయా పనులు గురువారం ప్రారంభమయ్యాయి.

ముందస్తుగా తరలివస్తున్న భక్తులు

తాడ్వాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రద్దీ పెరుగుతోంది. వనదేవతలకు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు ముందస్తుగా తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చి సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం 10వేల మందికి పైగా తరలివచ్చారని దేవస్థానం అధికారులు తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతర జరగనుంది. ఈ క్రమంలో భక్తులు ముందస్తుగా కుటుంబ, బంధుమిత్రులతో కలిసి వచ్చి దేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం మేడారం గ్రామ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో విడిది చేసి సాయంత్రానికి తిరుగు ప్రయాణం చేశారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



01: మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ గురువారం ప్రారంభించారు. మీడియా సెంటర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల సంఘం నియమ నిబంధనలు జిల్లాలో మండలాల వారీగా మూడు విడతల్లో జరుగనున్న గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్ వివరాలు, ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరి చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఉండాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. మీడియా సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించి డీఆర్‌డీవో మేన శ్రీను, ఇన్‌చార్జి డీపీఆర్‌వో అయూబ్‌అలీలు కలెక్టర్‌కు వివరించారు.

టీఈ-పోల్ యాప్‌లో సమస్త సమాచారం

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల సమాచారాన్ని సులభంగా అందించేందుకు రూపొందించిన టీఈ-పోల్ (తెలంగాణ ఎలక్షన్స్) మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వివరాలు, సంబంధిత సమాచారాన్ని తెలియపరిచేందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గూగుల్ స్టోర్ నుంచి టీఈ-పోల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం వివరాలు, ఓటర్ స్లిప్ నమోదు సమాచారం తదితర ముఖ్య సమాచారం సులభంగా తెలుసుకోవచ్చన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటెయ్యాలని కోరారు. ప్రతి ఒక్కరూ టీఈ-పోల్ యాప్‌ను ఉపయోగించడంతో పాటు ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.



టీఈ-పోల్ యాప్ చిత్రం

నామినేషన్ వేస్తున్నారా...

పంచాయతీ అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలివే...

వరంగల్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. నామినేషన్లకు మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఎన్నికల అధికారులు నిబంధనలకు అనుగుణంగా పలు రకాల ధ్రువ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. వాటిని ముందుగానే సిద్ధం చేసుకుని తీసుకెళ్లాలి. ఈ విషయం తెలియక పోటీ చేయడానికి ఉత్సాహంగా ముందుకెళ్లినా సరైన పత్రాలు సమర్పించకుంటే పోటీ నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేయాలంటే నామినేషన్ వేసే సమయానికి ముందు అభ్యర్థులు తెలుసుకోవాల్సినవి/చూసుకోల్సిన పత్రాల వివరాలు..

- పోటీ చేసే అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలు ఉండాలి.
- సంబంధిత ఓటరు లిస్టులో ఓటరుగా నమోదై ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రం జతపరచాలి.
- నేర చరిత్ర, స్థిర, చరాస్తుల వివరాలు, విద్యార్హతలతో కూడిన అఫిడవిట్, ఇద్దరు సాక్షులతో సంతకాలు పెట్టించి ఇవ్వాలి.
- ఎన్నికల ఖర్చు లెక్క అప్పగిస్తానని డిక్లరేషన్ ఇవ్వాలి.
- ఏ స్థానం నుంచి పోటీ చేస్తున్నారో.. ఆ స్థానం నుంచి ఓటరు మాత్రమే ప్రతిపాదకుడిగా ఉండాలి.
- అభ్యర్థులు ఎన్నికల ఖర్చు సర్పంచ్‌లకు రూ. 1,50,000, వార్డు మెంబర్లకు రూ.30,000 పరిమితి ఉంది.

నామినేషన్ పత్రంలో...

పార్ట్ 1లో ప్రతిపాదకుడు, పార్ట్ 2లో అభ్యర్థి, పార్ట్ 3లోనూ అభ్యర్థి, పార్ట్ 4లో ఆర్వో, పార్ట్ 5లో (రిజెక్టెడ్ నామినేషన్స్ రీజన్స్)లో ఆర్వో, పార్ట్ 6లో (రశీదు)లో ఆర్వో, అఫిడవిట్‌లో ఇద్దరు సాక్షుల సంతకాలు ఉండాలి. అలాగే ఖర్చు డిక్లరేషన్‌లో అభ్యర్థి సంతకం ఉండాలి.

నామినేషన్ పత్రంతో జత పరచాల్సినవి

నాలుగు ఫొటోలు, నామినేషన్ డిపాజిట్ రశీదు (జిరాక్స్), స్వీయ ప్రకటన (అఫిడవిట్), డిపాజిట్, పంచాయతీ నుంచి నో డ్యూ సర్టిఫికెట్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్‌లు పోటీ చేసేవారివి, బలపరిచేవారివి కుల ధ్రువీకరణ పత్రాలు.

నామినేషన్ డిపాజిట్ వివరాలు

పదవి పేరు	జనరల్ అభ్యర్థులు	ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు
సర్పంచ్	రూ. 2000	రూ. 1000
వార్డ్ మెంబర్	రూ. 1000	రూ. 500

సర్పంచ్, వార్డు ఎన్నికల వ్యయ వివరాలు ఇవే..

మహబూబాబాద్ రూరల్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎన్నికల్లో నిబంధనావళి ప్రకారం ఖర్చుచేసే వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. 2011 జనాభా ప్రకారం 5 వేల పైగా జనాభా ఉన్న గ్రామ సర్పంచ్ అభ్యర్థులు ఇప్పటి పంచాయతీ ఎన్నికల్లో రూ.2.50 లక్షలు ఖర్చు చేయవచ్చన్నారు. 5 వేలోపు జనాభా పంచాయతీల్లో రూ.1.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధన ఉంది. ఇక వార్డుల విషయానికొస్తే 5వేల జనాభా కంటే ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యుడిగా పోటీచేసే అభ్యర్థి రూ.50వేలు, 5వేల లోపు జనా భా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యుడిగా పోటీచేసే వ్యక్తి రూ.30 వేలు ఖర్చు చేసుకోవాలని ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది.

'బ్రాండ్' మారింది గురూ..!

చిన్నబోతున్న చీప్ లిక్కర్



లింగాలఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు దిగువ శ్రేణి వర్గం చేరదీసిన 'చీప్' లిక్కర్ గ్రామపంచాయతీ ఎన్నికల పరంపరలో పడి చిన్నబోతోంది. పొద్దుందాకా కాయకష్టం చేసిన జనం సాయంత్రం కాగానే శరీర అలసటను మర్చిపోయేందుకు ఊరి పొలిమేరలో అందుబాటులో ఉన్న బెల్ట్‌షాప్‌లో దూరి కాసింత చీప్ లిక్కర్‌ను పుచ్చుకునే బడుగులు ఇప్పుడు బ్రాండ్ మార్చి కొత్తదనపు రుచులను ఆస్వాదిస్తున్నారు. ఎలక్షన్ల జోరులో చీప్ లిక్కర్ జోలికెళ్లి చీప్ అవ్వడమెందుకు అనుకుంటున్నారో ఏమో గానీ.. నిన్న మొన్నటి దాకా తక్కువ ధరల మద్యం సేవించిన వాళ్లంతా ఇప్పుడు బ్రాండ్ మార్చి ఖరీదైన మద్యానికే జైకొడుతున్నారు.

జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో గురువారం నామినేషన్ల పర్వం మొదలు కాగా అభ్యర్థుల వెంట వచ్చిన అనుచరగణమంతా చౌకధరల మద్యానికి పాతరేసి ఖరీదైన బ్లెండర్ ప్రైడ్, సిగ్నేచర్, 100పైపర్, టీచర్స్ మద్యాన్ని సెలెక్ట్ చేసుకుంటుడం గమనార్హం. సొమ్ము మనది కాకపోతే మనకంటే సోగ్గాడు ప్రపంచంలోనే లేడన్నట్లు తయారవుతున్నారు.

'కాళోజీ' వర్సిటీలో అక్రమ నియామకం

నెలకు రూ. 90వేల వేతనం

వరంగల్ మెడికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజనీర్ నియామకాన్ని అక్రమంగా చేపట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నెలకు రూ. 90వేలు చెల్లించే విధంగా నియామకం చేపట్టినట్టు తెలుస్తోంది. విశ్వవిద్యాలయంలో ఉద్యోగాల భర్తీ చేయాలంటే ప్రభుత్వ అనుమతితో పాటు నోటిఫికేషన్ జారీ చేయాలి. కానీ ఇందుకు విరుద్ధంగా నెల రోజుల క్రితం విశ్వవిద్యాలయ కీలక అధికారి ఓ సివిల్ ఇంజనీర్‌ను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించినట్లు తెలుస్తోంది. ఇతడికి ప్రతీ నెల రూ.90వేల వేతనం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. సివిల్ ఇంజనీర్ గత నెల రోజులుగా ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి పీఏ నంటూ చెప్పుకొంటున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు.

ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

వరంగల్ మెడికల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో పొరుగు సేవల ఉద్యోగి (ఔట్ సోర్సింగ్)ని సర్వీస్ నుంచి తొలగించారు. ఈ మేరకు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి గురు వారం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి లేఖ రాశారు. బుధవారం రాత్రి గాయపడ్డ రోగికి వెంట్రుకలు తొలగించేందుకు బార్బర్ శ్రీనివాస్ డబ్బులు డిమాండ్ చేశారు. ఈ తతంగాన్ని రోగి బంధువులు వీడియోలో బంధించి సూపరింటెండెంట్‌కు సాక్ష్యంతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే సదరు బార్బర్ శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఎవరి ఎ'జెండా' వారిదే...

(5వ పేజీ తరువాయి)

ఖర్చులు, పోల్‌మేనేజ్‌మెంట్ విషయంలో ఆ పార్టీలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా ఓట్లు పోలైన పరకాలతో పాటు భూపాలపల్లి, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలపై కమలం పార్టీపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

ఎజెండా ఇలా..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లవుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికలు కావటంలో ఆ పార్టీ ప్రజాతీర్పును తమకు అనుకూలంగా వచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు గ్యాస్ సబ్సిడీ, 200యూనిట్ల ఫ్రీ విద్యుత్ తదితర సంక్షేమ పథకాలతో తమను ప్రజలు ఆదరిస్తారనే ఆశతో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నాయి. సన్న బియ్యం, సన్న వడ్లకు రూ.500 సబ్సిడీ కూడా ఓట్లు రాలుస్తాయనే ధీమాతో కాంగ్రెస్ ఉంది. అన్నింటికి మించి ఇందిరమ్మ చీర కానుకతో పల్లెపోరులో మహిళలు మద్దతుగా నిలుస్తారని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.

ఇక ప్రతిపక్షాలు ప్రధానంగా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీస్తున్నాయి. బుధవారం వరంగల్ పర్యటనలో కేటీఆర్ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం చేశారని ధ్వజమెత్తారు. 42శాతం అని హామీ ఇచ్చి, కనీసం 17శాతం కూడా రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వటం లేదని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

ఎంతో కీలకం

గ్రామ పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారగా, బీఆర్‌ఎస్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల కావస్తున్న క్రమంలో జరుగుతున్న ఎన్నికలు కావటంతో గెలుపు ఆ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. ప్రభుత్వం, ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు ఇచ్చే తీర్పుగా భావించే అవకాశం ఉంది. దీంతో మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలవటం ఆ పార్టీకి సవాల్‌గా మారింది. బీఆర్‌ఎస్‌కు కూడా స్థానిక ఎన్నికలు జీవన్మరణ సమస్యగానే మారుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటమి తరువాత వరుసగా వస్తున్న అన్ని ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొంది. ఉమ్మడి జిల్లాలో బలమైన నేతలు, క్యాడర్ ఉన్నప్పటికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే వరంగల్, నల్గొండ,ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఓటమి గులాబీ తమ్ముళ్లను నిరాశకు గురి చేసింది. ఆ తరువాత రాష్ట్రంలో పలుచోట్ల జరిగిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో వరుస ఓటములు గులాబీని కుంగతీశాయి. దీంతో సర్పంచ్ ఎన్నికల్లో గెలిస్తేనే క్యాడర్ కారులోనే ప్రయాణించే అవకాశం ఉందని, లేదంటే ప్రత్యామ్నాయం చూసుకునే అవకాశం లేకపోలేదనే ఆందోళన గులాబీ నేతల్లో వ్యక్తం అవుతోంది. సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు ఆ పార్టీకి జీవన్మరణంగా మారిందనే టాక్ వినబడుతోంది. ఇక బీజేపీ గతంలో కూడా గ్రామాల్లో పెద్దగా సర్పంచ్‌లను గెలిపించుకున్న దాఖలాలు లేవు. అయితే ఈసారి ఉనికి చాటుకునే ప్రయత్నాలు చేస్తోంది.

కాసుల వర్షం..!

ఊరూరా వసూలవుతున్న మొండి బకాయిలు



లింగాలఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లుగా పేరుకుపోయిన మొండి బకాయిలు స్థానిక సంస్థల ఎన్నికల పుణ్యమా అని గంపగుత్తగా వసూలవుతున్నాయి. గడిచిన రెండేళ్లుగా నిధులు లేక నిస్తేజంగా ఉన్న గ్రామపంచాయతీ ఖాతాల్లో సర్పంచ్ ఎన్నికల కారణంగా కాసుల వర్షం కురుస్తోంది. ఎన్నికల నియమావళిలో నామినేషన్ దాఖలు చేసే ప్రతీ అభ్యర్థితోపాటుగా తనను ప్రతిపాదించే వ్యక్తులు కూడా గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయి ఉండకూడదు. ఇంటిపన్ను, నల్లా పన్నులాంటివి ఏవైనా కూడా పూర్తిగా చెల్లిస్తేనే సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి నో డ్యూ సర్టిఫికేట్‌ను అందజేస్తారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులతో పాటుగా ప్రతిపాదకులకు సంబంధించిన బకాయిలు మొత్తం చెల్లించేదుకు గ్రామపంచాయతీల ఎదుట క్యూ కడుతుండటం గమనార్హం. దీంతో ఇన్నాళ్లు సిబ్బంది జీతాలకు డబ్బులు లేక వెలవెలబోయిన పంచాయతీ ఖాతాలు ఇప్పుడు ఎన్నికల పుణ్యమాని కురుస్తున్న కాసుల వర్షంతో కళకళలాడనున్నాయి.

అంతటా ఎన్నికల ముచ్చట్లే..

నర్మెట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక(పంచాయతీ) సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఒక్కసారిగా మాట ముచ్చటతో రాజకీయ హడావుడి మొదలైంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఏ రిజర్వేషన్ వచ్చింది. గ్రామాల్లో ఎక్కువగా మన మనిషి ఎవరు, ఎవరు పోటీలో ఉంటున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎవరినీ నిలబెడితే గెలుస్తాం అని సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికలో పలువురు పోటీకి వస్తుండడంతో పార్టీల నాయకులు తర్జన భర్జన అవుతున్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్‌లు, ఆయా సామాజిక వర్గాల బలాబలాలకు అనుగుణంగా గెలిచే వ్యక్తుల ఎంపికపై పార్టీల నాయకులు అందరితో సమాలోచనలు, వ్యూహరచనలు మొదలుపెట్టారు. పార్టీలు పక్కనపెట్టి ఆశావహుల వ్యక్తిగత చరిష్మా, గ్రామాల్లో చేసిన సేవలు, ప్రజలలో పేరు ఎట్లా ఉందనే విషయాలపై పార్టీల నాయకులు ఆరా తీస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం జరిగే ఎన్నికల్లో వ్యక్తిగత చరిష్మా, సామాజికవర్గం, ధనం ప్రధాన అస్త్రాలుగా మారనున్నట్లు తెలుస్తోంది.



జనరల్ స్థానంలో ఓసీలు జీరో

- సాల్వాపూర్‌లో ఒకేఒక్క గుర్తు తెలియని ఓసీ మహిళ..
- ఆమెది మా ఊరు కాదంటున్న స్థానికులు



సాల్వాపూర్ గ్రామం

బచ్చన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ రిజర్వేషన్‌లో ఓసీలు లేని గ్రామం జనరల్ స్థానానికి ఎంపికైంది. బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ గ్రామ పంచాయతీగా 50ఏళ్ల క్రితం ఏర్పడింది. గ్రామంలో ఓసీలు ఒక్కరు కూడా లేకపోవటం యాధృచ్ఛికమే. కానీ గుర్తు తెలియని మహిళ ప్రేమలతా రెడ్డి పేరు ఓసీ కింద సాల్వాపూర్ ఓటరు లిస్టులో నమోదై వస్తోంది. తమ గ్రామానికి చెందిన మహిళే కాదని గ్రామస్థులతోపాటు పంచాయతీ కార్యదర్శి మధు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి గ్రామంలో ఒక్కరు ఓసీలు లేరని, గుర్తు తెలియని పేరు ఎలా నమోదై వచ్చిందో తెలియదంటున్నారు. పేరు తొలగించేందుకు నివేదిక పంపామని కార్యదర్శి తెలిపారు. ప్రస్తుతం సాల్వాపూర్ గ్రామం జనరల్ స్థానంగా రిజర్వేషన్ ఖరారైంది. కానీ ఓసీ జనాభా లేకపోవడంతో మిగతా కులాలకు చెందిన వారు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కలిగింది. గ్రామంలో 1,483 మంది జనాభా ఉండగా ఇందులో 1,213మంది ఓటర్లున్నారు. పురుషులు 587, స్త్రీలు 626 మంది ఓటర్లున్నారు. ఇందులో బీసీలు 1,062, ఎస్సీలు 139, ఎస్టీలు 11 మంది ఉన్నారు.

అన్ని సర్పంచ్ స్థానాలు గెలవాలి : పల్లా



రమేష్ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా

నర్మెట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి మండలంలో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. హన్మంతాపూర్ మాజీ ఉపసర్పంచ్ పండుగ రమేష్ జ్యోతి దంపతులు గురువారం నర్మెట మండలకేంద్రంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం తీసుకోవాల్సిన వ్యూహాలపై నాయకులతో ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్దన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ ఎమ్డీ గౌస్, మాజీ సర్పంచ్‌లు ఆమెడపు కమలాకర్‌రెడ్డి, రామిని శివరాజు, నాయకులు ప్రజ్ఞాపురం అంజయ్య, ఇట్టబోయిన రమేష్, కంతి రాజలింగం, గుడికందుల నరహరి, నరేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థుల ప్రకటన



లక్ష్మాపూర్‌లో ఎంపికైన అభ్యర్థి వివరాలు ప్రకటిస్తున్న ఇన్‌చార్జీలు

బచ్చన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన పలు గ్రామాల అభ్యర్థుల వివరాలను గురువారం ఆ పార్టీ నేతలు ప్రకటించారు. బండనాగారం- శివరాత్రి రాజనర్సయ్య, లక్ష్మాపూర్- నూకల కల్పన రాజిరెడ్డి, నాగిరెడ్డిపల్లి- బంగారు రవి, పడమటి కేశ్వాపూర్- ఎర్రోళ్ల విజయ, లింగంపల్లి- మద్దికుంట రాధ, మన్‌షాన్‌పల్లి-శాకంపల్లి రవీందర్‌రెడ్డి, గంగాపూర్- జిల్లెల్ల భాస్కర్‌రెడ్డి, నక్కవానిగూడెం- పోతుల వెంకటేశ్‌లను బలపరుస్తూ ఎన్నికలకు వెళ్తున్నట్టు నేతలు తెలిపారు. 26గ్రామ పంచాయతీలను మూడు క్లస్టర్లుగా విభజించి ఇన్‌చార్జ్‌లను నియమించారు. వారి సమక్షంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. 28న అన్ని గ్రామాల సర్పంచ్ అభ్యర్థులను ప్రకటిస్తామని నేతలు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి మాజీ వైస్‌ఎంపీపీ



కిరణ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు

లింగాలఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల పరిషత్ తాజా మాజీ వైస్ ఎంపీపీ కొండబోయిన కిరణ్‌కుమార్ గురువారం తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి స్వాగతం పలికారు. ఆయనతో పాటుగా రిటైర్డు ఈవో కొండబోయిన రాములు మరో ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ నిఖిల



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ నిఖిల

జనగామ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఎన్నికల అబ్జర్వర్ నిఖిల సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల అబ్జర్వర్ నిఖిల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిల మాట్లాడుతూ ఎన్నికకు సంబంధించిన ప్రతీ అంశంపై అధికారులు శిక్షణ తీసుకొని పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, జడ్పీ సీఈవో మాధురి షా, అధికారులు పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు కలెక్టరేట్‌లో ఎన్నికల అబ్జర్వర్ నిఖిల, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిశిల మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సమాచారం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో పల్లవి, ఈడీఎం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



ఖిలాషాపూర్‌లో పరిశీలిస్తున్న పింకేష్ కుమార్

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్

రఘునాథపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్లకు కేటాయించిన సిబ్బంది, ఎన్నికల సామగ్రికి సంబంధించిన వివరాలు తదితర అంశాలపై గురువారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఖిలాషాపూర్ క్లస్టర్‌లో నామినేషన్ ప్రక్రియను పరిశీలించడంతోపాటు దరఖాస్తుల స్వీకరణ, ఎన్నికల నిబంధనల అమలు తదితర అంశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో వెంకటేశ్వర్లు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

జఫర్‌గడ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : కూనూరు జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులచే మాక్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలు, పోలింగ్, ఓటింగ్ విధానం, బ్యాలెట్ పత్రాలు, అభ్యర్థుల నామినేషన్లు, తదితర ఎన్నికల ప్రక్రియపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఈ నమూనా ఓటింగ్ ద్వారా వివరిస్తూ అవగాహన కల్పించారు. విద్యార్థులే అభ్యర్థులుగా పోటీ చేయడంతోపాటు ఓటర్లుగా విద్యార్థులు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దేవరుప్పుల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృ షి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అన్నా రు. గురువారం కామారెడ్డిగూడెం, కొలుకొండ గ్రామాల్లో గ్రామ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సమావేశంలో మాటా ్లడారు. కార్యక్రమంలో కొలుకొండ గ్రామస్థులు బరిలో నిలిచే ఆశా వహుల జిబితాను శ్రీరామ్‌కు అందించారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

తరిగొప్పుల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల మధ్య ఉంటూ పనిచేసే వారిని గుర్తించి, పంచాయతీ ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టాలని సింగల్ విండో మాజీ చైర్మన్ కాంగ్రెస్ నాయకుడు అర్జుల సుధాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కష్ట సుఖాల్లో తోడుగా ఉండే వారిని గుర్తించి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అర్జుల సునీత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వం అండ



ఆలలీంపూర్‌లో ఎల్వోసీ అందిస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

బచ్చన్నపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం ఆలీంపూర్ గ్రామాలకు చెందిన మొర్రి అంజయ్య జీర్ణకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా అతనికి రూ.2.50 లక్షల ఎల్వోసీ, అదే గ్రామానికి చెందిన పాకాల మురళికి ప్రమాదవశాత్తు కాలు తెగగా చికిత్స కోసం రూ.75వేల ఎల్వోసీలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సహకారంతో మంజూరు చేయించి అందించారు. కార్యక్రమంలో నాయకులు పాకాల అశ్విన్, ఎలికట్టె గణేశ్‌గౌడ్, యాదగిరి, శంకర్, కర్ణాకర్ తదితరులున్నారు.

నిరుపేదకు ఇంటి పైకప్పు నిర్మాణం



పైకప్పు నిర్మించిన ఇంటి వద్ద బాలరాజు

దేవరుప్పుల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పెద్దమడూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త బీఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన గొడిశాల బాలరాజు కుటుంబం ఉండడానికి గూడు లేక ఇబ్బంది పడుతున్న వియాన్ని పలువురు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ దృష్టికి తీసుకెల్లగా తక్షణమే స్పందించిన శ్రీకాంత్ గురువారం రూ.50వేల ఇంటి పైకప్పు రేకులు వేయించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నర్మెట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీవో కావ్యశ్రీనివాసన్ పరిశీలించారు. 17గ్రామ పంచాయతీలకు 12జీపీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన సదుపాయలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మాన్‌సింగ్‌తండా స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

అహంకారం, బలుపుతో మాట్లాడితే పెద్ద నాయకుడు కాలేడు

(5వ పేజీ తరువాయి)

36మంది ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకొని ఇద్దరిని మంత్రులు చేసినప్పుడు గుర్తురాని నీతి, నిజాయతీ కడియం విషయంలో గుర్తు వస్తుందా అని నిలదీశారు. బీఆర్ఎస్‌లో 36మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకున్నప్పుడు ఫిరాయింపుల విషయం గుర్తు రాలేదా, అప్పుడు ఏం పీకావు అని కేటీఆర్‌పై మండిపడ్డారు. అసలు కేటీఆర్ నాయకత్వం పైన సందేహాలు వస్తున్నాయని, ఆయన నాయకత్వంలో పని చేయలేమనే కవిత దూరమైందని, హరీష్‌రావు బాధపడుతున్నాడన్నారు. కేటీఆర్‌ది ఐరన్‌లెగ్, అయనతో కలిసి పనిచేయలేమని బీఆర్ఎస్ నేతలు ఆలోచిస్తున్నారని తెలిపారు. హరీష్‌రావు సమయం కొరకు చూస్తున్నాడని, కేసీఆర్ ఉన్నాడని ఆగుతున్నారని, కేసీఆర్ ఉన్నన్ని రోజులు మాత్రమే పార్టీ ఉంటుందని, తర్వాత ముక్కలు, చెక్కలు అవుతుందని జోస్యం చెప్పారు. ఇప్పటికే కేటీఆర్ పైన అనేక కేసులు ఉన్నాయని, ఫోన్ ట్యాపింగ్ కేసు, కారు రేసింగ్ కేసులు ఉన్నాయని, ఎప్పుడు జైలుకు వెళ్లతావో తెలియదన్నారు. కేటీఆర్ చరిత్ర అందరికి తెలుసని, గోకుడూ గాళ్ల, గీకుడు గాళ్ల తాయరు అయ్యారని, నాయకుడే గోకుడూ, గీకుడూ చేస్తున్నాడని విమర్శించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ విధానమని, బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపితే కేంద్రం పైన ఒత్తిడి తేవాల్సిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాష్ట్రంలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని కడియం ఆరోపించారు. బీజేపీకి బీసీల పైన ప్రేమ ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్లు అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్, పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, అన్నం బ్రహ్మారెడ్డి, తెల్లాకుల రామకృష్ణ, కత్తుల కట్టయ్య, కందుల గట్టయ్య, చింత ఎల్లయ్య పాల్గొన్నారు.

మాన్‌సింగ్‌తండా ఏకగ్రీవం

తరిగొప్పుల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. పలు గ్రామాల్లో పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు ఆశావహులు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మాన్‌సింగ్‌తండా పంచాయతీ సర్పంచ్‌గా గ్రామానికి చెందిన కత్తుల కొమురయ్యతోపాటు ఆరుగురు వార్డు సభ్యుల ఎన్నికను గ్రామస్థులు శుక్రవారం పార్టీలకు అతీతంగా ఏకగ్రీవం చేస్తున్నట్లు తీర్మానం చేశారు. దీంతో మాన్‌సింగ్‌తండా మండలంలోని మొదటి ఏకగ్రీవ పంచాయతీగా నిలుస్తోంది. ఈ ఎన్నికకు సంబంధించిన అధికారిక సమాచారం అధికారులు ప్రకటించాల్సి ఉంది. మాన్‌సింగ్‌తండా బీసీ జనరల్‌కు రిజర్వు కాగా, గొల్ల సామాజిక వర్గానికి చెందిన రైతు కొమురయ్యను ఎన్నుకున్నారు.

నామినేషన్లు షురూ!

(5వ పేజీ తరువాయి)



రంగరాయగూడెం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న శిరీష్‌రెడ్డి, పాంనూర్ సర్పంచ్‌కి నామినేషన్ దాఖలు చేస్తున్న గణేష్‌రెడ్డి

నామినేషన్లు అంతంత మాత్రంగానే దాఖలు అయ్యాయి. ఎన్నికల నోటిఫికేషన్ మంగళవారం రావడం నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచే ప్రారంభం కావడంతో నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులకు సమయం సరిపోలేదు. సమయం లేకపోవడంతో జిల్లావ్యాప్తంగా చాలా చోట్ల రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయలేదు. జిల్లాలో మొదటివిడత నామినేషన్లు ప్రారంభమైన మండలాల్లోనూ చాలా గ్రామాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తి కాలేదు. దీంతోపాటు అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును చూపేందుకు బ్యాంకు ఖాతాలు తెరవాల్సి ఉంటుంది. దీని కోసం బ్యాంకులకు అభ్యర్థులు పరిగెత్తాల్సి వచ్చింది. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థికి గ్రామ పంచాయతీ, విద్యుత్ బిల్లులు క్లియర్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటినీ పూర్తి చేసేందుకు సమయం చాలకపోవడంతో నామినేషన్లు అంతంత మాత్రంగానే పడ్డాయి. మొదటి విడత ఐదు మండలాల్లో సర్పంచులకు 108, వార్డు సభ్యులకు స్థానాలకు 44 నామినేషన్లు దాఖలయ్యాయి. లింగాలఘనపురం మండలంలోని సర్పంచులకు 15, వార్డు సభ్యులకు 11 నామినేషన్లు, జఫర్‌ఘడ్ మండలంలో సర్పంచులకు 24, వార్డు సభ్యులకు 8 నామినేషన్లు వచ్చాయి. అదే విధంగా చిల్పూరు మండలంలో సర్పంచులకు 17, వార్డు సభ్యులకు 10, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో సర్పంచులకు 17, వార్డు సభ్యులకు 7, రఘునాథపల్లి మండలంలో సర్పంచులకు 35, వార్డు సభ్యులకు 8 నామినేషన్లు వచ్చాయి. కాగా.. శుక్ర, శనివారాలు మంచిరోజులు లేవని పలువురు చెబుతున్నారు. శనివారమే చివరి తేదీ కావడంతో మంచి రోజులు కానప్పటికీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

గ్రామాభివృద్ధికి ఓటేయండి

కొడకండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకే ఓటేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ కోరారు. గురువారం మండలంలోని లక్ష్మక్కపల్లి,పెద్దబాయి తండా, సీఎం తండా, రేగుల, రూగుల తండా, ఖైదం చెరువు తండా, గిర్ని తండాల్లో గ్రామ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీల ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, గ్రామాలను ఏకగ్రీవం చేస్తే ప్రభ్వు రూ.15 లక్షలు ప్రోత్సాహకం ఇస్తోందన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన సీనియర్ నాయకులు



రాజయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

చిలుపూర్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం పార్టీ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, పల్లా యువసేన వ్యవస్థాపకుడు కేశిరెడ్డి రాకేశ్ రెడ్డి నేతృత్వంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తాజా మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, అంబేద్కర్ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు ఇల్లందుల సుదర్శన్, గడ్డమీది వెంకటస్వామి సహా వంద మంది వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య సమక్షంలో, హనుమకొండలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన నాయకులకు రాజయ్య కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మోటం రాములు, చుక్క అరుణ్, గుంటి భీముడు, తాళ్ళపల్లి క్రాంతికుమార్, జగన్నాథం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయే..

(5వ పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుంది.

సౌకర్యాల ఏర్పాటు..

బాల వైజ్ఞానిక ప్రదర్శనలో సౌకర్యాల కొరత లేకుండా చూడాలని అధికారులు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రదర్శన గదుల కేటాయింపు, మోడల్స్ ఏర్పాటు, భద్రతా చర్యలు, మార్గదర్శక బోర్డులు, తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత వంటి వసతులు కల్పించారు. విద్యార్థులకు, వీక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రదర్శనను విద్యార్థులు వీక్షించేందుకు రెండు గ్రూపులుగా విభజించారు. 28న జనగామ, లింగాలఘణపురం, రఘునాథపల్లి, నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శన వీక్షణకు రావాలని, 29న మిగిలిన మండలాలైన స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు, జఫర్‌గఢ్, దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శనను చూసేందుకు రావాలన్నారు.

వెంటనే మూల్యాంకనం...

సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం ప్రారంభంతోనే మూల్యాంకనం కూడా ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. అందుకు రకరకాల కమిటీలతో మొత్తం 30 మంది జ్యూరీ సభ్యులను నియమించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఎగ్జిబిట్లను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు అక్కడ ప్రతిభ కనబరిచిన ఎగ్జిబిట్లను దక్షిణ భారత స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన డిసెంబరులో నిర్వహించనున్నారు.

ప్రదర్శన విజయవంతం చేయాలి

సీహెచ్.ఉపేందర్, డీఎస్‌వో, జనగామ



రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను అధికారులు విజయవంతం చేయాలి. ముందుగా సూచించిన మండలాల విద్యార్థులు మాత్రమే ఆయా రోజుల్లో ప్రదర్శనకు రావాలి. 29న మధ్యాహ్నాంతో ప్రదర్శన ముగుస్తుంది. అనంతరం ముగింపు సమావేశం ఉంటుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సమావేశంలో మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందిస్తారు.